
సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



పనులు పూర్తయ్యేదెన్నడు?
ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మిస్తున్న చిట్టాపూర్ ఎత్తిపోతల పథకం పనులు ముందుకు సాగడం లేదు.
- 8లో ▸



నా రూటే సపరేటు..
మాక్లూర్ మండలం మాదాపూర్ శివారులో లీజు గడువు ముగిసినా క్వారీ నుంచి అక్రమంగా కంకర తరలిస్తున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /17.7

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగవచ్చు. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అదనపు కోర్టుల ప్రారంభం



ఖలీల్‌వాడి: జిల్లాకు కొత్తగా మంజూరైన కోర్టులను శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాం ప్రారంభించారు. జిల్లాకు ఇటీవల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి(అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి), ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి(జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్) కోర్టులు మంజూరయ్యాయి. జిల్లా కోర్టుల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వీటిని జస్టిస్ తుకారాం ప్రారంభించారు. అనంతరం కోర్టు సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆయనకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జిల్లా జడ్జి సునీత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు డీసీపీ జయరాం తదితరులు స్వాగతం పలికారు.

మేడారం జాతరకు 270 బస్సులు

ఖలీల్‌వాడి: మేడారంలో ఈ నెల 19 నుంచి 29 వరకు జరిగే సమ్మక్క సారక్క జాతరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి 270 బస్సులు పంపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ట్రిప్పులు తగ్గించామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. జాతర తర్వాత యథావిధిగా బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు.

కార్గో ద్వారా మేడారం ప్రసాదం

కామారెడ్డి టౌన్: మేడారం సమ్మక్క సారలమ్మ బంగారం ప్రసాదాన్ని ఆర్టీసీ కార్గో సేవల ద్వారా పొందవచ్చని ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. శనివారం ఆమె ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ప్రసాదాన్ని బుక్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారం వెళ్లలేని భక్తులు రూ. 299 చెల్లిస్తే ఇంటికే అమ్మవారి ప్రసాదాన్ని పంపిస్తామన్నారు. పేటీఎం ఇన్‌సైడర్ యాప్ ద్వారా కూడా ప్రసాదం బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్‌లు లింగమూర్తి, వసుంధర, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు తదితరులున్నారు.

డీటీవో బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీవో కార్యాలయం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(డీటీవో) వెంకటరమణ శనివారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దుర్గా పరిమళ మహబూబ్‌నగర్ నుంచి జిల్లాకు వచ్చారు.

ఘనంగా నీలకంఠేశ్వరుడి చక్రతీర్థం



నిజామాబాద్ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో స్వామివారికి శనివారం అర్చకులు చక్రతీర్థం ఘనంగా నిర్వహించారు. రథోత్సవం అనంతరం శివపార్వతులను పుష్కరిణికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం భక్తుల శివనామస్మరణలో ఉత్సవ విగ్రహాలకు అర్చకులు సుహాస్‌శాఖాయ్, మకరందు శాఖాయ్, నీలేష్ కులకర్ణి పుష్కరిణిలో స్నానం ఆచరింపచేశారు.

ఒత్తిడిని తగ్గించుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవాలని ఏఆర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సైకాలజిస్ట్ శిరీష అన్నారు. నగరంలోని మైనార్టీ బాలికల పాఠశాల-కళాశాలలో శనివారం 'బేటి బచావో బేటి పడావో' పథకంలో భాగంగా జీవన నైపుణ్యాలు, మానసిక ఆరోగ్యం మార్గదర్శక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులకు జీవన నైపుణ్యాల మానసిక ఆరోగ్య పరిస్థితులు వివిధ యాక్టివిటీస్ ద్వారా వారి స్ట్రెస్ ఎలా కంట్రోల్ చేసుకోవాలో తెలియజేశారు. శ్రద్ధతో చదివితే ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, పుష్ప, ప్రిన్సిపాల్ ఫెబా క్రిస్టినా, విద్యార్థినులు పాల్గొన్నారు.



మరాఠ్వాడా సామ్రాజ్యాధినేత.. హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవిత చరిత్ర స్ఫూర్తిగా.. ఆయనను ఆరాధించేవారు జిల్లాలో క్రమక్రమంగా పెరుగుతున్నారు. పల్లెల నుంచి మొదలుకొని నగరాల వరకు ప్రతి ఏటా ఆయన జయంతిని పండుగలా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఊరూరా శివాజీ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో శివాజీనగర్, దుబ్బ, రైల్వేస్టేషన్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల కూడళ్లను శివాజీ చౌక్‌లుగా పిలుచుకుంటున్నారు. సోమవారం శివాజీ మహరాజ్ 394వ జయంతిని ఘనంగా జరుపుకునేందుకు శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో నగరంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

మహారాష్ట్ర సరిహద్దుతో ప్రభావం

మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను దైవసమానంగా భావిస్తారు. ఇందూరు జిల్లా మహారాష్ట్ర సరిహద్దుకు అనుకుని ఉండడంతో పాటు ఈ జిల్లాపై శివాజీతో పాటు ఆయన గురువైన సమర్థ రామదాసు ముద్ర ఎక్కువగా ఉంది. శ్రీరాముడు, హనుమంతుడి భక్తుడైన సమర్థ రామదాసు 17వ శతాబ్దంలో నిర్మింపజేసిన ఆలయాలు ఇందూరులో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇందూరులోని పెద్దరామమందిర్, సారంగపూర్ హనుమాన్ ఆలయం, రఘునాథ ఆలయాలు సమర్థ రామదాసు ఆధ్వర్యంలో నిర్మితమయ్యాయి. రఘునాథ ఆలయంలో ధ్యాన మందిరం నిర్మించారు. ఇందులో సమర్థ రామదాసుతో పాటు ఛత్రపతి శివాజీ సైతం ధ్యానం చేసుకున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. సారంగపూర్ హనుమాన్ మందిరం ప్రాంగణంలో సమర్థ రామదాసు విగ్రహం ఉంది. రఘునాథ ఆలయం, పెద్దరామమందిరాలతో పాటు సారంగపూర్ ఆలయాన్ని ఛత్రపతి శివాజీ సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది.

సండే స్పెషల్



ఎడపల్లి మండలం రాణాకలాన్‌లో ఛత్రపతి విగ్రహం

జై.. ఛత్రపతి

- భారీగా శివాజీ మహరాజ్ విగ్రహాల ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా సుమారు 200 పైగా గ్రామాల్లో..
- మరాఠ్వాడా వీరున్ని స్ఫూర్తిగా తీసుకుంటున్న యువత
- జిల్లాపై మహారాష్ట్ర సరిహద్దు ప్రభావం
- రేపు 394వ జయంతి




గతేడాది శివాజీ జయంతి సందర్భంగా నగరంలో శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి ప్రదర్శన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హిందూ హృదయ సామ్రాట్‌గా కీర్తి గడించిన మరాఠ్వాడా సామ్రాజ్యాధినేత ఛత్రపతి శివాజీ మహరాజ్ ట్రెండ్ ఇందూరు జిల్లాలో విస్తృతంగా విస్తరిస్తోంది. వరుసగా ఒక్కో గ్రామంలో శివాజీ మహరాజ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 200 పైగా విగ్రహాలను వివిధ గ్రామాల్లో నెలకొల్పారు. గతంలో యువత మాత్రమే శివాజీ విగ్రహాల ఏర్పాటుకు మొగ్గు చూపేవారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో యువతతో పాటు పెద్దలు, మహిళలు సైతం ఛత్రపతి విగ్రహాల ఏర్పాటులో భాగం పంచుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులే శివాజీ విగ్రహాల ఏర్పాటులో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. శివాజీ అణగారిన, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడడంతో పాటు తల్లిని ఏవిధంగా గౌరవించాలో ఆచరించి చూపారని, ఇలాంటి స్ఫూర్తి కోసమే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఎవరి సమస్యలు వారే పరిష్కరించుకోవాలనే స్ఫూర్తిని సైతం శివాజీ నుంచి పొందవచ్చని యువకులు చెబుతున్నారు. ఇక ఇందూరు నగరంలో శివాజీనగర్, దుబ్బ, రైల్వే స్టేషన్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల కూడళ్లను శివాజీ చౌక్‌లుగా పిలుచుకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో మరిన్ని గ్రామాల్లో శివాజీ విగ్రహాలు నెలకొల్పేందుకు ఆయా గ్రామాల ప్రజలు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రేపు ఇందూరు నగరంలో భారీ ప్రదర్శన

శివాజీ మహరాజ్ 394వ జయంతిని పురస్కరించుకుని సోమవారం శ్రీ శివాజీ మహరాజ్ సేవా సమితి ఇందూరు జిల్లా ఆధ్వర్యంలో ఇందూరు నగరంలో హైదరాబాద్ రోడ్‌లో ఉన్న బోర్గం వద్ద నుంచి వినాయక్‌నగర్, పులాంగ్, శివాజీనగర్ శివాజీ చౌక్, పెద్ద బజార్, నెహ్రూ పార్క్, రైల్వే స్టేషన్ శివాజీ చౌక్ వరకు భారీ ర్యాలీ చేయనున్నారు. 2017 నుంచి పనిచేస్తున్న శ్రీ శివాజీ మహరాజ్ సేవాసమితి తరఫున జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది సభ్యులు పనిచేస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ హాలిడేగా ప్రకటించాలని సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం లక్ష్మణ్ రావు, జి రవికుమార్ డిమాండ్ చేస్తున్నారు.







చందూరు మండలం గోవూరులో శివాజీ విగ్రహం, గన్నారంలో.. నిజామాబాద్ రైల్వేస్టేషన్ వద్ద..

వేగంగా గృహజ్యోతి నమోదు

- జిల్లాలో 70 శాతం పూర్తి

నిజామాబాద్ నాగారం: గృహజ్యోతి పథకం అమలు కోసం విద్యుత్ వినియోగదారుల వివరాల నమోదు ప్రక్రియ జిల్లాలో వేగంగా సాగుతోంది. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందించడానికి వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే.. దీంతో అధికారులు, సిబ్బంది ఈ నెల 6 నుంచి ఇంటింటికి తిరుగుతూ వినియోగదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. మీటర్ నంబర్, ఆధార్, రేషన్ కార్డు వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 70శాతం వినియోగదారుల నమోదు ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో 8 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాల కనెక్షన్లు 4.80 లక్షలు. ఇందులో ఇప్పటి వరకు 3లక్షల 40వేల కనెక్షన్లకు సంబంధించి వివరాలు నమోదు పూర్తయింది. సాధ్యమైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఎన్పీడీసీఎల్ పరిధిలో వివరాల నమోదులో జిల్లా మూడో స్థానంలో ఉంది.



నగరంలో విద్యుత్ వినియోగదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్న ఏడీఈ, సిబ్బంది

మూడు రోజుల్లో పూర్తి చేస్తాం

జిల్లాలో అత్యధికంగా విద్యుత్ సర్వీస్ కనెక్షన్లున్నాయి. కంపెనీ పరిధిలో వివరాలు సేకరణలో మూడో స్థానంలో ఉన్నాం. మరో మూడు రోజుల్లో 100శాతం సర్వే ప్రక్రియ పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.

– రవీందర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ

బీఆర్‌ఎస్ పాలనలోనే చక్కెర కర్మాగారం మూత

- 20న ఫ్యాక్టరీని సందర్శించనున్న 'పునరుద్ధరణ కమిటీ'
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్: బీఆర్‌ఎస్ పాలనలోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూత పడిందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వస్తే కర్మాగారాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటామని చెప్పిన కేసీఆర్, కవిత తర్వాత పట్టించుకోలేదన్నారు. ఐకేపీ, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. షుగర్ ఫ్యాక్టరీని పునఃరుద్ధరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. 15 రోజుల క్రితం దీనిపై సమీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫ్యాక్టరీపై బ్యాంకుల్లో రూ.200 కోట్ల అప్పు ఉంటే ఇప్పుడది రూ.400 కోట్లకు చేరిందని చెప్పారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. ఈ కమిటీ సభ్యులు ఈ నెల 20న బోధన్‌కు వచ్చి ఫ్యాక్టరీని సందర్శిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామన్నారు. రైతులు నీటిని వృథా చేయొద్దని సూచించారు. డిగ్రీ చదువుతున్న దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా లక్షా ట్రై మోటార్ సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగశంకర్, ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ, సూపర్‌వైజర్లు రాధిక, సౌజన్య, గంగవేణి, ఆసియా, కిరణ్, నాయకులు పాషా మోయినొద్దీన్, తూము శరత్ రెడ్డి, మీర్ నజీర్ అలీ, ప్రమోద్, దొడ్ల రవీందర్ రెడ్డి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ట్రై మోటార్ సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఆకట్టుకున్న ఆవిష్కరణలు

- విజయవంతంగా 'వన్ డిస్ట్రిక్ట్-వన్ ఎగ్జిబిషన్'
- పాల్గొన్న రైతులు, విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'వన్ డిస్ట్రిక్-వన్ ఎగ్జిబిషన్' కార్యక్రమం విజయవంతమైంది. వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు వచ్చి ప్రదర్శించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. రైతులు, విద్యార్థులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆవిష్కరణలను తిలకించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డు) సంయుక్తంగా నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో రైతులు, వాటాదారుల ప్రయోజనం కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామీణ, అట్టడుగు ఆవిష్కరణలకు మార్కెట్‌ను ఏర్పాటు చేయడానికి ఇదొక మంచి వేదికగా మారిందన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన పరికరాలు, మోటార్లు, యంత్రాల పనితీరు గురించి సందర్శకులకు ఆవిష్కర్తలు వివరించారు. మొత్తం 30మంది ఆవిష్కర్తలు ఎగ్జిబిషన్‌లో పోటీ పడ్డారు. ఈడీఎం కార్తీక్, టీఎస్ఐసీ మేనేజర్ బుద్ధవరపు వాణి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఏవో వాజిద్ హుస్సేన్, ఆవిష్కరణలను తిలకిస్తున్న మహిళలు

నిలిచిపోయిన చెల్లింపులు

- ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ కల్పించని ప్రభుత్వం

మోర్తాడ్: గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల చెల్లింపులు నిలిచిపోయాయి. పంచాయతీల్లో పాలన కోసం ప్రత్యేకాధికారులను నియమించి 15 రోజులు దాటినా వారికి చెక్ పవర్‌ను ఇంకా కల్పించలేదు. దీంతో వివిధ రకాలైన చెల్లింపులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీలకు పాలకవర్గం ఉన్నప్పుడు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ ఉండేది. ఈ నెల ఒకటో తేదీకి పాలకవర్గాల పదవి కాలం ముగిసిపోవడంతో రెండో తేది నుంచి ప్రత్యేకాధికారులను నియమించారు. గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించి వారికి రెండు, మూడు పంచాయతీల పాలనా బాధ్యతలను అప్పగించారు. పంచాయతీల జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి సంబంధించి ప్రత్యేకాధికారులకు చెక్ పవర్‌ను కల్పించాల్సి ఉంది. ప్రత్యేకాధికారితో పాటు పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ చెక్ పవర్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆర్థిక సంఘం నిధుల వినియోగం కోసం ప్రత్యేకాధికారులకు డిజిటల్ కీ ఇవ్వాల్సి ఉంది. జనరల్ ఫండ్, ఎస్ఎఫ్‌సీ నిధుల వినియోగం కోసం బ్యాంకు చెక్‌లపై సంతకాలను మార్పించాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందకపోవడంతో చెక్‌పవర్ అంశం పెండింగ్‌లో ఉంది. ఫలితంగా సిబ్బందికి జీతాలు చెల్లించడం, పంచాయతీల నిర్వహణ, ఇతర బిల్లుల చెల్లింపుల కోసం ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి స్పందించి ప్రత్యేకాధికారులకు చెక్ పవర్ వెంటనే కల్పించాలని పలువురు కోరుతున్నారు.



పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

సుభాష్‌నగర్: పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ వరకు కొనసాగుతాయని వివరించారు. ఇంటర్ పరీక్షలకు 35,346 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పదో తరగతి పరీక్షలకు 22,274 మంది విద్యార్థులకుగాను 143 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డికి సూచించారు. సకాలంలో ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు చేరాలన్నారు. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో నియమించాలని ఆదేశించారు. డీఐఈవో రఘురాజ్, జిల్లా విద్యాశాఖ ఏసీ విజయభాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



డొంకేశ్వర్(ఆర్మూర్): ఉపాధిహామీ అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగుల సంఘం నూతన కమిటీ శనివారం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా అన్నపూర్ణ, ఇస్రా, జాయింట్ సెక్రటరీలుగా లక్ష్మణ్, శ్రీనివాస్, శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు డీఆర్‌డీవో సాయాగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంపీడీవో కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఎడపల్లి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించారు. దీంతో మండలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించకూడదన్న నిబంధనలు ఉన్నా జన్మదిన వేడుకలు నిర్వహించారని అంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో గోపాలకృష్ణను వివరణ కోరగా తాను ఆ సమయంలో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లానని ఆ విషయం తెలియదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాం, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు వీడీఏ అమలు చేయాలి



ఖలీల్‌వాడి: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం(వీడీఏ) అమలు చేయాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ నాయకులు బీడీ కంపెనీ యజమానుల సంఘం అధ్యక్షుడు ప్రకాశ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు కరువు భత్యం పెరిగిందని దానిని వెంటనే అమలు చేస్తే కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా నాయకుడు బి.లింగం పాల్గొన్నారు.

నా రూటే సపరేటు..

- మాదాపూర్ కంకర క్వారీ యజమాని వింత పోకడ
- గడువు ముగిసి మూడేళ్లయినా కొనసాగుతున్న వైనం
- అర్ధరాత్రి కొనసాగుతున్న పనులు
- రూ. 43.50 లక్షల జరిమానా విధించినా మారని ధోరణి
- అండగా నిలుస్తున్న అధికారులు?



నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్న కంకర క్వారీ

మాక్లూర్: ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా తనను ఎవరూ.. ఏ అధికారి ఏమీ చేయరన్న పొగరుతో ఓ కంకర క్వారీ యజమాని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడు. సదరు క్వారీ లీజు గడువు ముగిసినా యథేచ్ఛగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండిగొడుతున్నాడు. ఇటీవల ఉన్నతాధికారులు క్వారీని సీజ్ చేసినా సంబంధిత అధికారులకు ఆమ్యామ్యాలు చెల్లిస్తూ అర్ధరాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా మైనింగ్ పనులు చేపడుతున్నట్లు సమాచారం.

మండలంలోని మాదాపూర్ శివారులో ఉన్న ప్రభు త్వ భూమిలో గ్రానైట్‌ను ఆధారంగా చేసుకొని కొన్నేళ్లుగా రెండు కంకర క్వారీలు కొనసాగుతున్నాయి. అందులోని ఓ కంకర క్వారీ గడువు 2020 ఫిబ్రవరి 3న ముగిసింది. అయినా నాటి నుంచి ఆ క్వారీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయం ఇటీవల స్థానిక ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డికి మాక్లూర్ పర్యటనలో భాగంగా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే కంకర మిషన్‌లోకి వెళ్లి తనిఖీ చేయడంతో అసలు విషయం బయటపడింది. మూడేళ్లుగా ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా ఎలా కొనసాగిస్తున్నారని క్వారీ యజమానిని ప్రశ్నించారు. ఈ విషయమై మైన్స్ ఏడీ సత్యనారాయణను నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే క్వారీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీజ్ చేయించారు. రూ. 43.50 లక్షల జరిమానా విధించేలా చేశారు. విధించిన జరిమానా చెల్లించి, క్రషర్‌కు కొత్తగా అనుమతులు పొందే వరకు విద్యుత్ సరాఫరాను నిలిపి వేయాలని మైన్స్ ఏడీతో విద్యుత్ అధికారులకు లెటర్ కూడా జారీ చేయించారు. కానీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు మాత్రం విద్యుత్ సరఫరాను నిలిపివేయలేదు. దీంతో సదరు క్రషర్ యజమాని అర్ధరాత్రుల్లో క్రషర్ పనులు చేసుకుంటున్నట్లు సమాచారం.

చర్యలు తీసుకుంటాం

మాదాపూర్ శివారులో అనుమతులు లేకుండా కొనసాగుతున్న కంకర క్వారీని సీజ్ చేసి యజమానికి నోటీసులు జారీ చేశాను. క్వారీకి విద్యుత్ సరఫరాను నిలిపి వేయాలని విద్యుత్ శాఖ అధికారులకు లెటర్ కూడా ఇచ్చాను. క్వారీ రాత్రి వేళల్లో కొనసాగుతున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, మైన్స్ ఏడీ, నిజామాబాద్

గణితంపై భయం వీడాలి



అబాకస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డీఈవో దుర్గాప్రసాద్

- డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు గణితంపై భయం వీడితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో విశ్వం అబాకస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గణిత పోటీలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. అబాకస్ నేర్చుకుంటే పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం విశ్వం స్కూల్ ల్యాబ్స్ వారి కొత్త సబ్జెక్టు కోడ్ చాంప్‌ను ప్రారంభించారు.
పోటీల్లో గెలుపొందిన 48 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వం నిర్వాహకులు శివరాజ్‌కుమార్, సాయిస్రవంతి, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యేలు



సమావేశంలో పాల్గొన్న కులాచారి దినేశ్‌కుమార్, రాకేష్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి

డిచ్‌పల్లి: న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు శనివారం పాల్గొన్నారు. బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌కుమార్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, ప్రభారీలు సమావేశంలో పాల్గొన్నారు. నాలుగేళ్లకోసారి నిర్వహించే బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో మరోసారి మోదీ.. మూడోసారి మోదీ ప్రధానిగా విజయం సాధించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పార్టీ అధిష్టానం నిర్దేశించినట్లు దినేశ్‌కుమార్ తెలిపారు.

గత ప్రభుత్వం ఉద్యోగులను అణచివేసింది

- ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

సుభాష్‌నగర్: గత ప్రభుత్వం ఉద్యోగులను అణచివేసిందని, వారి జీతభత్యాలు సకాలంలో చెల్లించక మానసికంగా వేధించిందని ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని టీఎన్‌జీవో కార్యాలయంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన టీఎన్‌జీవో, టీజీవో, క్లాస్–4 ఉద్యోగ సంఘాల క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సప్లిమెంటల్ బిల్లులన్నీ త్వరలో ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల సమస్యలను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సమన్వయ పర్చుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర కీలకమని గుర్తుచేశారు. అనంతరం మహేశ్‌కుమార్ గౌడ్‌తోపాటు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ కో చైర్మన్, టీజీవో జిల్లా అధ్యక్షుడు అమృత్‌కుమార్, ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు నేతికుంట శేఖర్, సాయిలు, టీజీవో జిల్లాకార్యదర్శి హన్మంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పోల శ్రీనివాస్, సతీశ్, అజ్మీర రాంజీ, గౌండ స్వామి, దేవీసింగ్, రాములు, వినయ్‌కుమార్, లావణ్య, పద్మా భార్గవి, అన్ని యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సుమన్ కుమార్, దినేశ్‌బాబు, శుభాకర్, రమేశ్, రాజు, నాగరాజు, కేపీ సునీత, విజయలక్ష్మి, మంజుల, ఉమా కిరణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్ (ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 2లక్షల 95వేల 654 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మృతి

- నివాళులర్పించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి



రాజన్న (ఫైల్)



సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు

జక్రాన్‌పల్లి: డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న శనివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన రాజన్న కొంతకాలంగా గుండె పోటుతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లో చికిత్స మృతిచెందాడు. రాజన్న అంత్యక్రియలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి హాజరై సంతాపం వ్యక్తం చేశారు. రాజన్న తనకు చిన్ననాటి మిత్రుడని విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమంలో క్రియశీల పాత్ర పోషించాడన్నారు. అంత్యక్రియల్లో డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సామ్యూల్, శ్రీనివాస్‌రెడ్డి, శంతన్, సుదర్శనం, శ్రీధర్, విజయ రామరాజు, బాలయ్య, దేవుల, ప్రభాకర్, ఉపాధ్యాయ సంఘం నాయకులు విజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, సత్యానంద్, రమేశ్, సుదాం, సత్యనారాయణ, శ్రీకాంత్, ధర్మేందర్, ప్రతాప్, ప్రజా సంఘాల నాయకులు దేవరాం, కిషన్, ఆల్గోట్ రవీందర్, అడ్వకేట్ సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

‘లిఫ్ట్’ పనులు పూర్తయ్యేదెన్నడు?

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా ఎత్తిపోతల నిర్మాణం
- రూ.149.52 కోట్ల నిధులు మంజూరు
- ప్రారంభమై.. ముందుకు సాగని పనులు



లిఫ్ట్ నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం



చిట్టాపూర్ వద్ద నిలిచిన పైపులైన్ పనులు

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్, ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, కోమన్‌పల్లి గ్రామాల పరిధిలో సుమారు 3500 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో ప్రారంభించిన లిఫ్ట్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో పనులు పూర్తయ్యేదెన్నడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ఆధారంగా కోమన్‌పల్లి శివారులో పంపుహౌజ్ నిర్మించి, సుర్బిర్యాల్, ఫత్తేపూర్, చిట్టాపూర్ వరకు పైపు లైన్ ద్వారా నీటి సరఫరా చేపట్టాలని గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఇందుకోసం గతేడాది అక్టోబర్ నెలలో రూ.149.52 కోట్లు మంజూరు చేసింది. అదే సమయంలో బాల్కొండ మండలం చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారి 44 పక్కన ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. తరువాత లిఫ్ట్ నిర్మాణ పనుల్లో భాగంగా పైపులైన్ తవ్వకాలు, పైపులు వేయడం వంటి పనులు చిట్టాపూర్ శివారులో చేపట్టారు. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ వద్ద పంపు హౌజ్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. ఆ తరువాత పనులు ముందుకు సాగడం లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికైనా పనులు పూర్తవుతాయని రైతులు ఆశించారు. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తే మరో ఏడాదైనా పనులు ముందుకు సాగేలా కనిపించడం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి వెంటనే పనులను ప్రారంభించి వేగవంతం చేయాలని ఆయకట్టురైతులు కోరుతున్నారు.

ఆయకట్టుకు అందని నీరు

చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల ఆయకట్టు చివరి వరకు నీరందడం లేదు. ఈ గ్రామాలకు గుత్ప ఎత్తిపోతల ద్వారా నీరు అందుతోంది. దీంతో పంట చేతికొచ్చే సమయంలో పంటలు ఎండిపోతున్నాయి. చిట్టాపూర్‌లో అధిక శాతం బోరు బావుల ఆధారంగాపంటలు సాగు చేస్తారు. కానీ చెరువులో నీరు ఉంటేనే భూగర్భ జలాలు అధికంగా ఉంటాయి. ఆ చెరువే ఖాళీ అయితే పంటలకు నీరు అందడం కష్టమవుతుంది. ఈ నేపథ్యంలో లిఫ్ట్ ద్వారా నీటి సరఫరా అత్యవసరం. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి లిఫ్ట్ పనులను వేగవంతం చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పంటల కారణంగానే ఆలస్యం

చిట్టాపూర్ ఎత్తిపోతల పథకం పైపులైన్ పనులు చేపట్టాలంటే అడ్డుగా పంటలు ఉన్నాయి. పంటలు లేనిచోట పనులు చేపడుతున్నాం. పంటలు అయిపోగానే పనులను వేగంగా చేపడుతాం. – సురేశ్, డిప్యూటీఈఈ, మైనర్ ఇరిగేషన్ బాల్కొండ

ఐఎంఎల్ డిపో ఎక్సైజ్ ఎస్సైగా ప్రమోద్ చైతన్య

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ ఐఎంఎల్ డిపోలో ఎక్సైజ్ ఎస్సైగా ప్రమోద్ చైతన్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పని చేసిన ఎస్సై సుదర్శన్ ఎఫ్‌డీవోగా ప్రమోషన్‌పై కామారెడ్డికి బదిలీ అయ్యారు. ఆర్మూర్ ఎక్సైజ్ కార్యాలయంలో పనిచేస్తున్న ప్రమోద్ చైతన్య మాక్లూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఇరువురు అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో బీఎం గురువయ్య, కానిస్టేబుల్ చల్ల బాబు, కార్మిక సంఘం అధ్యక్షుడు దుబాయ్ శ్రీను, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సిర్‌పూర్‌లో ద్విచక్ర వాహనం దగ్ధం

మోపాల్: మండలంలోని సిర్‌పూర్‌లో తస్లిమాకు చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి దహనం చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని కొత్త కాలనీలో తస్లిమా రోజూ మాదిరిగానే తన ఇంటి ఎదుట వాహనాన్ని నిలిపింది. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహం అడ్డగింత

ధర్పల్లి: మండల కేంద్రంలో బాల్యవివాహాన్ని అధికారులు శనివారం అడ్డుకున్నారు. మండల కేంద్రానికి చెందిన మైనర్ అమ్మాయికి జక్రాన్‌పల్లికి చెందిన 23 ఏళ్ల యువకుడితో ఈనెల 18న వివాహం చేయాలని ఇరు కుటుంబీకులు నిర్ణయించారు. దీంతో బాల్య వివాహం చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి, చైల్డ్‌లైన్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ జ్యోత్స్న, ఎస్సై వంశీకృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి అమ్మాయి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాల్య వివాహం చేయడం నేరమని వారికి అవగాహన కల్పించారు. అమ్మాయి మేజర్ అయ్యాకే వివాహం చేయాలని లేకపోతే అది నేరమని హెచ్చరించారు.

కొండచిలువ పట్టివేత



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో కొండచిలువను పోలీసులు శనివారం పట్టుకున్నారు. సుమారు 10 అడుగుల పొడవు ఉన్న కొండచిలువ ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని పట్టుకున్నట్లు తెలిపారు. దీనిని అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని మెండోరా ఫారెస్ట్‌సెక్షన్ అధికారి గణేశ్ తెలిపారు. ఎస్సై భాస్కరా చారి, ఏఎస్సై చిన్న గంగారాం, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



కిరణ్ కుమార్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ మెడికల్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని విద్యుత్‌నగర్ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త బస్టాండ్ ఎదురుగా మెడికల్ నిర్వహిస్తున్న కుసుమ కిరణ్‌కుమార్(35) డిగ్రీ కళాశాల గ్రౌండ్ సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. అతనికి ఆరేళ్ల క్రితం పల్లవితో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పిల్లలతో కలిసి పల్లవి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి చెందిన కిరణ్‌కుమార్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి లక్ష్మీపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత..

బిచ్కుంద(జుక్కల్): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దదడ్గి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తంబలి లక్ష్మి(45) భర్త గంగారాంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన లక్ష్మి గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మాక్లూర్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై సుధీర్‌రావు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాణిక్‌బండార్ చౌరస్తాలో కాలినడకన ఓ వ్యక్తిని శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో ఓ కారు ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. సదరు వ్యక్తి ఒంటిపై బనియన్, లుంగీ తప్ప ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. కార్పొరేటర్ రాయ్‌సింగ్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి, రామడుగు శివారులోని వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం ఉదయం పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బోధన్‌రూరల్‌లో..

బోధన్‌రూరల్: మండలంలోని ఖండ్‌గావ్–కొప్పర్గ శివారులో రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. ప్రభుత్వ అనుమతి తీసుకొని ఇసుకను తరలిస్తున్నట్లు డ్రైవర్లు చెప్పారని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.